# గడుగ్గాయిలు

రచన: "ప్రనీల్"

నేనూ ఉత్కళరావూ క్లబ్‌లోకి ప్రవేశించేసరికి మాటలు మహా జోరుగాసాగుతున్నై. రామలింగయ్యగారు అంటున్నారు.

'...నా పిల్లవాళ్ళనుగురించి నీకెట్లా తెలుస్తుందయ్యా? మరీ మాట్లాడుతావుగాని- ఐనా, ఆమాటకొస్తే నీకసలు పిల్లవాళ్ళనుగురిచి ఏం తెలుసని మహా మాట్లాడొచ్చావ్? పెళ్ళిలేదు, పెటాకులులేదు, నువు పిల్లవాళ్ళసంగతి నాతో వాదించటం ఏమిటంట? మరీ ఐపోయిందే నీపని.'

కానీ వెంకటేశం పాతికేళ్ళవాడైనా మాంచి చిచింద్రీలాంటి మనిషి.

'చాలెండి, మహా మాట్లాడారు. మొదటి పెళ్ళానికి సంతానం లేకుండాపోయింది. ఇప్పుడీ రెండో భార్యను సాధించి ఎట్లాగైతేనేం ఒక అల్లరి వెధవని ఉత్పత్తి చెయ్యగలిగారు. పెద్ద ఘనకార్యం చేసినట్టు చెప్పుకొస్తారేమిటి? ఆ ఆరేళ్ల కుర్రాడ్నిగురించి, వాడి వెధవవేషాల్నిగురించి, వాడి తెలివినిగురించీ, మాకెందుకీ ప్రకటనంతా?,

రామలింగయ్యగారు ఉగ్రులైపోయారు. యాభైఏళ్ళ ఏ పెద్దమనిషైనా ఉగ్రుడైపోవాల్సిన మాట-అన్నాడు ఈ వెంకటేశం. వెధవ, పీడిమాట లెప్పుడూ ఇంతే. ఎంత మాటవస్తే అంతమాట అంటాడు. అందులో రామలింగయ్యగార్ని పట్టుకొని ఇటువంటి కూతలా?

లేచి నుల్చొని కుర్చీచేతుల్ని తనచేతుల్తో పట్టుకొని ఏదో అనబోతున్నారు రామలింగయ్యగారు. సరిగ్గా ఆసమయానికే నేనూ, ఉత్కళరావూ వాళ్ళదగ్గరికి వచ్చేసరికి, ఆ క్లబ్‌కూ, వూరికీ కొత్తగావచ్చిన ఉత్కళరావును చూసి, మాట్లాడబోతున్న వారల్లా, నోరుమూసుకొని కుర్చీలో కూలబడ్డారు రామలింగయ్యగారు.

ఉత్కళరావుని అక్కడి వాళ్ళకు పరిచయం చేసాను. వాళ్ళందర్నీ ఉత్కళరావుకి తెలియజెప్పాను.

పాఠకులు కొంచెం ఓపికపడ్తే ఉత్కళరావునుగురించి రెండు ముక్కలు చెప్తాను.

ఉత్కళరావు చాల మితభాషి. చనువువున్నవాళ్లతోగూడ మామూలుగా బహుతక్కువ మాట్లాడుతాడు. కానీ, ఒకోక్కసారి మాట్లాడటం సాగించాడంటే అట్లాధారగా దొర్లించేస్తుంటాడు. ఉత్కళరావు మాట్లాడీ మూడ్‌లో వున్నట్లున్నాడు.

'నేను క్లబ్‌లోకి వస్తూండగా ఇక్కడి సభ్యులు, పిల్లవాళ్ల విషయంగురించి, శ్రద్ధ, ఉత్సాహాలతో ఘాటుగా చర్చిస్తున్నట్టు కనపడింది. మా తిరుమలరావుగారి మేనల్లుడు సంగతి మీకు తెలుసునా?' అని అడిగాడు.

ఉత్కళరావుని మా క్లబ్ సభ్యులు చూట్టం ఇదే మొదటిసారని, ఆ కారణంవల్ల తిరుమలరావుగారి మేనల్లుడి సంగతి మా అందరికీ తెలీటానికి అవకాశంలేదనీ, ఆ తిరుమలరావుగారి మేనల్లుడి సంగతి చెలవిస్తే ఆనందసాగరంలో మునిగితేల్తామనీ, ఉత్కళరావుకి వచ్చచెప్పాను. అప్పుడు ఉత్కళరావు చెప్పసాగించాడు.

మా తిరుమలరావుకి ఒక మేడ, ఒక కారు, ఒక ఉద్యోగం, ఒక భార్యవుండేవి. కానీ కొడుకులు లేకపోవటంతో తిరుమలరావు చింతాక్రాంతుడైనాడు. పుత్రులు లేకపోతే నరకానికి పోతాడనే భయమేమీలేదు కానీ, పుత్రుడులేని జీవితం ఒక జీవితమేనా అనుకున్నాడు తిరుమలరావు.

తనకు చేతైనవీ, సాధ్యమైనవీ, అన్నీ చేసిచూసాడు తిరుమలరావు. యాత్రలమీద నమ్మకం లేకపోయినా భార్యతో పుణ్యప్రదేశాలన్నీ సేవించాడు. తను నమ్మని దేవుళ్ళందరికీ దణ్ణం పెట్టుకున్నాడు. భార్యాభర్తలు మాంచి ఆరోగ్యంగానే వున్నారు. మరి పిల్లలు లేకపోవటానికి కారణం ఏమిటి? చిన్న పిల్లలంటే అమిత అపేక్షపడే తిరుమలరావు ఎక్కువరోజులు తన దురదృష్టంతో తృప్తిపడి ఉండలేకపోయాడు.

ఒక ఆదివారంనాడు పడక కుర్చీలో పండుకున్నట్లు కూర్చొని తన దురదృష్టానికి దుఃఖిస్తూ

ఏదో ఆలోచిస్తూవుండగా, అతడి భార్యవచ్చి పక్క నేకూచోని, తిరుమలరావు దుఃఖకారణం తెలుసుకొని, తటాలున ఒక మెరుపుతీగలాంటి భావం మెదడులోకి దూసుకుపోగా, తిరుమలరావు తన చిన్న మేనల్లుణ్ణి తెచ్చి పెట్టుకుంటే దుఃఖనివారణ అవుతుందని చెప్పింది. అతడికి ఈ ఆలోచన ఎప్పుడూ తట్టలేదు. తనభార్య జ్ఞానానికి ఆశ్చర్య పడిపోయాడు. సంతానం ఇవ్వపోయినా, సలహా ఎంతమంచిది ఇచ్చింది!

మూడోరోజుకే తన నాలుగేళ్ల చిన్న మేనల్లుణ్ణి తెచ్చి యింటిలోవుంచాడు. కొన్ని నెలలు ఆనందంతో గడిచిపోయింది. తిరుమలరావుకి కొంత మనశ్శాంతి ఏర్పడింది. కుర్రవాడు చంద్రశేఖరం భలే చురుకైనవాడు. ముద్దొచ్చే మొహం - చురుకైన మాటలు-అల్లరి పనులు-మాంచి తెలివైనవాడు. ఇంత చిన్న ఈడుకి ఎన్నిమాటలు మాట్లాడుతాడు!

చంద్రశేఖరానికి ఐదోఏడు వస్తున్నది. ఇహ బళ్లో వెయ్యాలె, వెధవవీధి బళ్ళల్లోకి పంపిస్తే నేమిటి? తన భావాలకీ, హోదాకు తగినట్లుగా ఏదన్నా ఇంగ్లీష్ కాన్వెంట్‌లో చేర్చాలిగాని! ...చంద్రశేఖరం బడికివెళ్ళి వస్తున్నాడు. భోంచెయ్యగానే రాత్రిపూట, ఒక గంటసేపు, తను బడిలో మాట్లాడిన మాటలూ, చేసిన పనులూ అన్నీ చెప్పుతుండేవాడు తిరుమలరావుకి. అతడు తన మేనల్లుడి మాటలు శ్రద్ధగా వినేవాడు. వాడడిగిన ప్రశ్నలన్నిటికి ఓపిగ్గా జవాబులు చెప్పేవాడు. ఇట్లా వాడితో కాలం వృధా చేసుకున్నందువల్ల తను చేసుకోవాల్సిన పనికి ఆటంకం కలుగుతుందని గ్రహించికూడా చంద్రశేఖరం పిచ్చిపిచ్చి ప్రశ్నలకు జవాబు చెప్తుండే వాడు. పిల్లవాళ్ల మీద విసుక్కోకూడదట. విసుక్కొని; పొమ్మంటే వాళ్లు బుద్ధిహీనులుగా తయారౌతారనీ, వాళ్ళల్లోవుండే తెలుసుకోవాల్నే అభిలాషనూ, ఆసక్తినీ చంపటం కేవలం పెద్దవాళ్ళ బుద్ధిహీనతనీ, తిరుమలరావు నాతో చాలాసార్లు నొక్కి చెప్పాడు.

'మామయ్యా - జర్మనులూ ఇంగ్లీషువాళ్ళూ ఎందుకు కొట్టుకున్నారు మామయ్యా?' అని వాడొక వెధవ ప్రశ్న వేస్తే, తిరుమలరావు చెమటోడ్చుకుంటూ యుద్ధం పుట్టు పూర్వోత్తరాల [illegible] ఒక గంటసేపు చెప్పాల్సి వచ్చేది. అంతటితో ఊరుకుంటే ఫరవాలేదు. 'మామయ్యా అసలెందుకు చదువుకోవాలి మామయ్యా,' అనగానే, దాంతో తిరుమలరావు ఆనందతన్మయుడై, కుర్రవాడు ఇంత గొప్పప్రశ్న లడిగినందుకు సంతోషించి, చదువు, జ్ఞానం, మొదలయినవాటిమీద ఓగంటన్నరసేపు ఉపన్యాసం దంచేవాడు. చంద్రశేఖరం చేసిన ప్రతి పనిలో ఏదో ఒక గొప్పతనం చూపించి అది తన భార్యకు తెలియజెప్పేవాడు.

కానీ అన్నిసుఖాలకీ, ఆనందాలకీ ఒక అంతము అనేది ఉండక తప్పదు. చంద్రశేఖరాన్ని మితిమీరిస్తున్నావని తిరుమలరావుకి చెప్పాను. కానీ తన పద్ధతి మార్చుకోలేదు తిరుమలరావు. ఆఖరికి ఒకరోజున చంద్రశేఖరం.

'మామయ్యా! మొన్న నేను నిద్రబోతున్నాననుకొని అత్తయ్యను ముద్దు పెట్టుకున్నావు- 'ఊరుకోండి, అవతలవాడున్నాడు'అని అత్తయ్య అంది కదా, అత్తయ్యకు ఆ భయమేమిటి మామయ్యా?'' అన్నాడు.

తిరుమలరావు అదిరిపోయాడు. పిడుగువంటి ప్రశ్న లడుగుతాడనికానీ, తనుచేసినవన్నీ చూశాడనికానీ, ఎప్పుడూ అనుకోలేదు.

అల్లాంటి ప్రశ్నలు అడగదగ్గవి కాదని చంద్రశేఖరానికి చెప్పాలనుకున్నాడు. కానీ మనోధైర్యం చాలక పోయింది. అప్పట్నుంచీ చంద్రశేఖరాన్ని జాగ్రత్తగా పెంచాల్సి వచ్చింది.

ఉత్కళరావు లేచి నిల్చున్నాడు. రామలింగయ్యగారు నోరుతెరిచి ఏమనాల్నో తోచకుండా చూస్తున్నాడు. వెంకటేశం సంతోషించాడు. అందరూ ఉత్కళరావుని అలా చూస్తున్నారు.

'వస్తానని' సెలవు తీసుకొని క్లబ్ బయటికి వచ్చాడు ఉత్కళరావు.

'తిరుమలరావంటే ఎవరు? బొంబేలో పని చేస్తున్న నీ స్నేహితుడా? అంటే......అతనికి కొడుకులున్నారే?' అన్నాను.

'తిరుమలరావంటే నాకెంత తెలుసో నీకూ అంత తెలుసు' అన్నాడు ఉత్కళరావు.

'ఐతే ఈ కోతలకు అవసరం?' అన్నాను ఆశ్చర్యమై.

'నాకు అనేక ఆనందం' అన్నాడు. తనకు ఇక ఆవిషయం మాట్లాడటం ఇష్టం లేదన్నట్లుగా.